క్లుప్తంగా

మేడే ఉత్సవాల్లో భాగస్వాములవ్వాలి

సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

మీర్‌పేట: మేడే ఉత్సవాల్లో కార్మికులంతా భాగస్వాములు కావాలని సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేట పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మికులతో మేడే ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. మేడే ఉత్సవాలను అన్ని కూడళ్లలో, వాడ వాడలా ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్మిక సంఘాలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు సత్యం, శ్యామ్, వీరయ్య, జగన్, పుల్లయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి

పహాడీషరీఫ్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీ కార్తీక్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి సైఫ్ పటేల్, సవూద్ పటేల్, నజీబ్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించారు. అనంతరం వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీ కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్, జనార్దన్, జహంగీర్, నిరంజన్, శ్రీనివాస్ గౌడ్, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కళలను బతికించుకుందాం

మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను బతికించుకుందామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో యాదవుల ఆధ్వర్యంలో బీరప్పస్వామి చరిత్ర స్టేజి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీనివాస్‌యాదవ్‌ను మండలంలోని వెల్జాల్‌లో బుధవారం రాత్రి కలిసి స్టేజి నాటకానికి ఆర్థిక సహాయం అందజేయాలని కోరగా ఆయన రూ. 5,000 కళాకారులకు అందజేశారు. కార్యక్రమంలో గౌతురెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, బాలకుమార్‌గౌడ్, శేఖర్, శ్రీశైలం, శివుడు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్

కడ్తాల్: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో భాగంగా గురువారం కడ్తాల మండల కేంద్రం నుంచి ఆమనగల్లు మండల కేంద్రం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీని జెండాను ఆవిష్కరించారు. అనంతరం రవికాంత్‌గౌడ్ మాట్లాడుతూ..పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో సామన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం ఎన్నికలపుడు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదని ఆరోపించారు. అదే విధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజా హామీలను విస్మరించిందన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మహేశ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు అజీమ్, రాజేశ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్

కడ్తాల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల తమ సమస్యలను ఎంపీపీ, జెడ్పీటీసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈనెల 28 లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ మధుసూధనాచారి, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు ఉన్నారు.

ప్రకృతి ప్రసాదం.. తాటి ముంజ

పోషకాలు పుష్కలం

- జీర్ణకోశ సమస్యలకు దివ్య ఔషధం
- చెడు కొలెస్ట్రాల్‌కు చెక్
- వడదెబ్బ నుంచి విముక్తి
- ఇలా బోలెడు ప్రయోజనాలు



తాటి ముంజలు



సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై తాటి ముంజల విక్రయాలు

హుడాకాంప్లెక్స్: వేసవిలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. వీటిని పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ అమితంగా ఇష్టపడతారు. ఇవి కల్తీ లేనివి, స్వచ్ఛమైనవి, మండుటెండ నుంచి మంచి ఉపశమనం తాటిముంజలు. వేసవి సెలవులకు పల్లెటూర్లు వెళ్లేవారు తాటి ముంజలని కచ్చితంగా లాగిస్తారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా ఇవి విరివిగా దొరుకుతున్నాయి. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేస్తాయి. వీటిలో ఉన్న మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.

- తాటి ముంజల్లో విటమిన్ బీ 7, విటమిన్ – కే, సొలెబుల్ ఫైబర్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ – ఏ, విటమిన్ –డీ, జింక్, ఐరన్‌తో పాటు న్యూట్రిన్స్ ఉంటాయి.
- తాటి ముంజల్లో సీటిశాతం ఎక్కువ ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా చేస్తాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లబరుస్తాయి. అంతేకాకుండా డీ హైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి.
- ముంజల్లో పొటాషియం సమృద్ధిగా ఉండడం వల్ల రక్తపోటు అదుపులో ఉండి గుండె ఆరోగ్యానికి సహాయ పడతాయి. ఇవి శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.
- ముంజలను రోజు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా లివర్ సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చు. తాటి ముంజలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. వీటిని తినడం వల్ల తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటి, కడుపు ఉబ్బడం, ఉదర సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి.
- వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. చికెన్ పాక్స్‌ను నివారించి శరీరంలోని అధిక బరువుని తగ్గించేందుకు తాటి ముంజలు ఎంతో సహాయ పడతాయి.
- ముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూతలా వేసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి వేసవిలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది. అలాగే ఎండ వేడిమి వల్ల ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది.

ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు



పొట్టుతో లేత ముంజలు తింటే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణకోశ సమస్యలకు దివ్య ఔషధం. పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినొచ్చు. ముంజ పండ్లు తినకూడదని అనడానికి కారణాలు అంటూ ఏమీ లేవు. హ్యాపీగా తినొచ్చు.

– డా. ప్రభాకరాచారి, విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు

ఆలయ ఈవోగా మురళీకృష్ణ

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన ఈవోగా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈవోగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో మురళీకృష్ణ కొనసాగనున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దినదినాభివృద్ధి చెందుతున్న ప్రాచీనమైన బాలాజీ ఆలయానికి విచ్చేసే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో నూతన పాలక మండలి కూడా కొలువుదీరనుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన పాలక మండలి ఏర్పడిన తర్వాత బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య

తుర్కయంజాల్: పేదలందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. తుర్కయంజాల్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సీపీఐ నేతలతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఇళ్ల స్థలాలను మంజూరు చేయకపోతే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తామన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటాచారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గువ్వల రాజు, పిల్లి కృష్ణ, దుబ్బ యాదయ్య, జనార్దన్, శ్రీను, విజయ, సుందరమ్మ పాల్గొన్నారు.

'బెదిరించి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు'

- 13వ డివిజన్ కార్పొరేటర్ బాలునాయక్
- మేయర్ పారిజాత ఆధ్వర్యంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి
- చిల్లర రాజకీయాలు మానుకోవాలని నేతల హితవు



మేయర్ పారిజాత సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బాలునాయక్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ కార్పొరేటర్ నేనావత్ బాలునాయక్ 24 గంటలు గడవక ముందే బీఆర్ఎస్ పార్టీని వీడి తిరిగి సొంతగూటికి (కాంగ్రెస్ పార్టీలో) చేరారు. కార్పొరేషన్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత ఆధ్వర్యంలో బాలునాయక్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తనను భయపెట్టి, బెదిరించి మంత్రి సబితారెడ్డి వద్దకు తీసుకువెళ్లి బలవంతంగా బీఆర్ఎస్ కండువా వేశారని తెలిపారు. ఆ కండువా మెడ మీద పడినప్పటి నుంచి నిద్ర కూడా లేదన్నారు. వెంటనే మాతృ పార్టీ కాంగ్రెస్‌లోకి వచ్చానని వెల్లడించారు. ఇంకోసారి ఈ తప్పు చేయనని, ప్రజలు క్షమించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు ఇతర పార్టీల వారిని బెదిరించి, భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీ బాబు, కార్పొరేటర్లు వీ ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు బీ రాఘవేందర్‌రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, బీ జంగయ్య, ఏ ప్రతాప్‌రెడ్డి, బీ గోవర్ధన్‌రెడ్డి, ఎం శ్రీధర్‌రెడ్డి, మహిళా విభాగం కార్పొరేషన్ అధ్యక్షురాలు అమృత నాయుడు, ఎస్ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా సీఎంఆర్‌ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ జంగయ్య

జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలైన నిరుపేదలు సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తన ఛాంబర్‌లో గురువారం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పి.ఎల్లమ్మకు రూ.20 వేలు(బాచుపల్లి), జి.లక్ష్మమ్మకు రూ.31 వేలు(పులిమామిడి), కిషన్ రూ.32,500(సార్లరావులపల్లి), డి.అంజమ్మ రూ.58,500(చిప్పలపల్లి), స్వరూప రూ. 25వేలు(ఎన్టీఆర్ తండా), జంగయ్య రూ. 42,500(చిప్పలపల్లి), నర్సింహకు మంజూరైన రూ.60వేల(సరస్వతిగూడ) విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు రాము, అనిత, శ్రీనివాస్, బాలకృష్ణ, కలమ్మరాజు, ఎంపీటీసీలు లలితకుమార్, ఇందిర, డైరెక్టర్ పీ ఆనంద్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిలు పాల్గొన్నారు.

సమస్యలను మంత్రికి వివరిస్తాం

త్వరలో పరిష్కారానికి చర్యలు

- కుమ్మరి బస్తీ పర్యటనలో అధికారుల హామీ



కుమ్మరి బస్తీలో పర్యటిస్తున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరి బస్తీలో నిర్వహిస్తున్న పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సర్కిల్ అధికారులు పర్యటించారు. డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌లోకి బోరు నీళ్లు వెళ్లి మురికిగా వస్తున్నాయని, తరచూ డ్రైనేజీ పొంగి పొర్లడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కా రం కోసం కొన్ని చోట్ల కొత్త లైన్లు, మరికొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అంతర్గత రహ దారులు దెబ్బతిన్న చోట మరమ్మతులు చేయా లని, అలాగే బస్తీలో ఓల్టేజీ సమస్యతో ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోతున్నాయని అధికారులకు వివరించా రు. సమస్యలను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్ కొండల్‌రెడ్డి, జీ శ్రీనివాస్‌గౌడ్, జీ నాగరాజు, విజయ్, ఏఈ ప్రశాంతి, శివ, సురేష్, సతీష్‌శంకర్, పో లీసు శాఖ నుంచి వెంకన్న, కాల నీవాసులు భిక్షప తి, సత్యంరాయుడు, నర్సింహ్మ, శ్రీను పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

మీర్‌పేట: ఈ నెల 25న జరగనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు ఎం అరవింద్‌శర్మ, బీ బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పహాడీషరీఫ్ ఆర్‌సీఐ రోడ్డులో జరిగే సమావేశానికి మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆర్‌కే పురం, సరూర్‌నగర్ డివిజన్లు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాలు, మహిళా నాయకురాళ్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహారెడ్డి, ఎన్ నరేందర్, కార్యదర్శి అంజయ్యగౌడ్, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల అధ్యక్షులు ఆర్ కామేష్‌రెడ్డి, ఆర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన



పహాడీషరీఫ్: మహిళలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న కొండల్ యాదవ్



కందుకూరులో రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత

పహాడీషరీఫ్: పేదరికం కారణంగా ఏ ఒక్కరూ పండుగకు దూరం కారాదన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు కానుకలు అందిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పండెం కొండల్ యాదవ్ అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్‌లో పేద మహిళలకు ఆయన రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరాకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్‌కు కానుకల తరహాలోనే రంజాన్‌కు తోఫాను అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

కందుకూరు: రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కానుకలను గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి, ఎంపీపీ ఎం జ్యోతిపాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతసామరస్యాన్ని కాపాడడంలో అందరూ ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ ఆలీ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు లలిత కుమార్, ఇందిర, మార్కెట్ డైరెక్టర్లు పీ ఆనంద్, ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్, బాలకృష్ణ, అనిత, నాయకులు సీ సాయిలు, పాండు గౌడ్, దామోదర్ గౌడ్, కార్తీక్, దీక్షిత్ రెడ్డి, సామయ్య, రామకృష్ణ, బీ వెంకటేష్, విఘ్నేశ్వర్‌రెడ్డి అంజాద్, అజ్జు, కృష్ణారెడ్డి, వెంకటేష్, గణేష్, ప్రభాకర్, నరేష్ పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: భగత్‌సింగ్ నగర్‌లో రంజాన్ కానుకలు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

భగత్‌సింగ్ నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: రంజాన్ వేడుకను సంతోషంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పీ దయాకర్‌రెడ్డి, బీ బాలకిషన్ కోరారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రంజాన్ కిట్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బోనాల పండుగకు ఆలయాల మరమ్మతులు, దసరాకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్‌కు కానుకలు, రంజాన్ సందర్భంగా మైనార్టీలకు వస్త్రాల పంపిణీ, మసీదుల మరమ్మతులకు, ఇఫ్తార్ విందులకు లక్షల రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ సలీం, ఎం సుదర్శన్ ముదిరాజ్, సీ రాజేష్‌గౌడ్, మహమ్మద్ జహీర్, ఎం మల్లేష్ పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్

మహేశ్వరం: వీఓఏలకు కనీస వేతనం రూ. 26 వేలు, అలవెన్సులు అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఏ శేఖర్ డిమాండ్ చేశారు. మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి నాలుగో రోజు చేరింది. దీక్షలోని వారికి శేఖర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. 19 సంవత్సరాలుగా గ్రామాల్లో మహిళల సంక్షేమానికి, స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్న వీఓఏలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సెర్ప్ ఉద్యోగుల తరహాలనే వీఓఏలకు కూడా వేతనాలు పెంచాలని కోరారు. ప్రతి వీఓఏకు రూ. 10లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. అర్హులైన వారిని సీసీలుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళిత బంధు పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు జీ లక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు, వీఓఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

కందుకూరు: సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. సీఐటీయూ మండల కన్వీనర్ బీ బాల్‌రాజు, వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సరస్వతి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట వీఓఏలు నిరసన తెలిపారు. తమ డిమాండ్లు తీర్చే వరకు సమ్మెను విరమించేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీపీ ఎం జ్యోతి, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు పీ రజిత, బీ హైమావతి, దేవి, ఐ గీత, రాధ, కవిత, లావణ్య, మంగ, సంగీత, బీపద్మ, మంజుల, సంతోష, రాంచంద్రారెడ్డి, సర్వతాలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఓఏలు